క్లుప్తంగా

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్‌లో ప్రతీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ఇది చక్కని వేదిక అని అన్నారు. ప్రజల నుంచి అందిన వినతులను సకాలంలో పరిష్కరించడం జరుగుతుందన్నారు.

రగ్గుల పంపిణీ


రగ్గులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పాచిపెంట: మండలంలో తులసిజోగివలస గ్రామంలో తమన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. దివంగత బొడ్డేపల్లి లక్ష్మి జ్ఞాపకార్థం గ్రామంలో సుమారు 40 మంది పేదలకు వాటిని పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు రామకృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఎయిర్ వెటరన్ సాగినారాయణరాజు, కిరణం మహిళా సమైఖ్య సంఘం సిబ్బంది ఫాతిమ, సాయిలక్ష్మి, శ్రీనివాసరావు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

పిక్నిక్‌ల సందడి


ఆటలాడుకుంటున్న చిన్నారులు

బలిజిపేట: కార్తీకమాసం కావడంతో పిక్నిక్‌ల సందడి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల సమీపంలో ఉన్న తోటలు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. చిన్నారులు, పెద్దలు అందరూ ఆటపాటలతో సరదాగా గడిపారు. సామూహిక వనభోజనాలు చేశారు. సమీప నదిలో, వాగుల్లో జలకాలాడారు. దగ్గరలోని ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు.

ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలి

- ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: మండల విద్యాశాఖ అధికారులకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ప్రభుత్వాన్ని కోరారు. ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని ఆదివారం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సామల మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారిగా దాదాపు 150 నుంచి 300 మంది టీచర్ల జీతభత్యాలను డ్రాచేస్తున్న ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. విద్యాశాఖ తరపున అనేక కార్యక్రమాలను ఎంఈఓలు నిర్వహిస్తుండగా, ఎంపీడీఓలు తమ శాఖ కు సంబంధంలేని అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటంతో ఎంఈఓలు పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా జీఓ నెంబర్ 89కు విరుద్ధంగా డీఈఓలు అన్ని విధులను ఎంఈఓ-1లే చేయాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. జీఓ నెంబర్ 89 ప్రకారం జాబ్ చార్ట్ కచ్చితంగా అమలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్యలపై ఇప్పటికే విద్యాశాఖ మంత్రికి, విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు డి.పుల్లయ్య, ఓబులేసు, ధనుంజయ మజ్జి, రవిశంకర్, మన్వర్ భాష, గంగిరెడ్డి, పద్మలత, రామారా వు, శ్రీనివాస్ నాయక్‌తో పాటు పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులు వేగవంతం

సీతానగరం: మండల పరిధిలో ఉపాధిహామీ పథ కం నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేయాల ని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను అన్నారు. నిడగల్లు నీలకంఠేశ్వరస్వామి ఆలయం నుంచి ముత్యాలదొరవలస వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిడగల్లు-ముత్యాలదొరవలస, సుమిత్రిపురం నుంచి వల్లరిగుడబ, బగ్గందొ రవలస జంక్షన్ నుంచి కొత్తవలసకు బీటీరోడ్డు నిర్మాణ పనులకు ఇటీవల ఎమ్మెల్యే బి.విజయచంద్ర భూమిపూజ చేశారని తెలిపారు. రూ.6 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. బగ్గందొరవలస జంక్షన్ నుంచి కొత్తవలస బీటీరోడ్డు పనులకు నిడగల్లు వద్ద ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఎర్త్‌వర్క్స్ జరుగుతున్నాయని తెలిపారు. ప్రారంభించిన పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ..



ప్రజలపై ఆర్థిక భారం మోపుతూ, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ కిసాన్ మోర్చా కార్మిక సంఘాల సభ్యులు ఆదివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ, సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ బంటు దాసు, తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయకపోగా.. బహుళజాతి కంపెనీలకు రూ.19 లక్షల కోట్ల రుణమాఫీ చేయడం సరి కాదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు, సీపీఎంఎల్ నాయకులు శ్రీనునాయుడు, తదితరులు మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయడంతో పాటు ఉపాధి పనులను 200 రోజులకు పెంచాలని..అలాగే రోజుకు రూ. 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజా, కార్మిక అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

– పాలకొండ రూరల్

అన్నదాతల అవస్థలు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి రైతుల అవస్థలు కొనసాగుతునే ఉన్నాయి. పంట కీలక దశలో సాగునీటి కాలువల ద్వారా నీరు అందించలేని అధికారులు.. ప్రస్తుతం కోతల సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటిని కట్టడి చేయలేకపోతున్నారు. పాలకొండ – వీరఘట్టం రహదారిలో వరి భూముల్లో నీరు నిల్వ ఉండడంతో కోతలు చేపట్టేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు.

– పాలకొండ రూరల్



మాజీ సైనిక ఉద్యోగుల ధర్నా..



పాలకొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న మాజీ సైనిక ఉద్యోగుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆ యూనియన్ అధ్యక్షుడు దుప్పాడ పాపినాయుడు కోరారు. ఆదివారం స్థానిక మాజీ సైనిక ఉద్యోగుల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకొండ డివిజన్‌లోని పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని మండలాల పరిధిలో 120 మంది మాజీ సైనిక ఉద్యోగులున్నారని తెలిపారు. వీరంతా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్నప్పుడు శ్రీకాకుళం సంక్షేమ కార్యాలయం పరిధిలో రిజిస్ట్రేషన్ అయి ఉన్నారని.. జిల్లాల పునర్విభజన తర్వాత వీరిని విజయనగరం సంక్షేమ కార్యాలయానికి మార్పు చేశారని తెలిపారు. దీని కారణంగా దూరం పెరిగి మాజీ సైనిక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని.. తమను శ్రీకాకుళం సంక్షేమ బోర్డు పరిధిలో ఉంచాలని కోరారు.

– పాలకొండ

జీవాలు జరభద్రం



- గొర్రెలు, మేకల్లో కాలిపుండ్ల వ్యాధితో జాగ్రత్త
- బురద నేలల్లో మేతకు తీసుకెళ్లడం వల్ల వ్యాధి సోకే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే జీవాల ప్రాణాలకు ప్రమాదం

గుమ్మలక్ష్మీపురం: శీతాకాలంలో గొర్రెలు, మేకలలో కాలిపుండ్ల వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. ఖరీఫ్ వరి కోతలు పూర్తయిన పొలాల్లో జీవాలు సంచరించడం వల్ల ఈ వ్యాధి వస్తుంటుంది. దీన్ని కాళ్ల గాళ్లు, గిట్టల పుండ్లు, బురద పుండ్లు, మితువకాళ్లు, పోడాళ్లు, తదితర పేర్లతో పిలుస్తారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే పశువైద్యులను సంప్రదించి చికిత్స అందించాలి. నిర్లక్ష్యం చేస్తే జీవాల ప్రాణాలకే ప్రమాదం. ఈ వ్యాధి లక్షణాలు, నివారణ పద్ధతులను గుమ్మలక్ష్మీపురం పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు వివరించారు.

వ్యాధి లక్షణాలు..

గిట్ల మధ్య చర్మం మెత్తబడి, వాచి, చిట్లిపోతుంది. గిట్టల మధ్య చీము పట్టి, నొప్పితో గొర్రెలు, మేకలు నడవలేక ముందు కాళ్లపై గెంతుతుంటాయి. వ్యాధి తీవ్రమైతే గిట్టలు ఊడిపోతాయి.

వ్యాధి నిర్ధారణ..

గిట్టల మధ్య చర్మం ఎర్రగా మరుతుంది. తర్వాత గిట్టల మధ్య వాపు వస్తుంది. దాని నుంచి చీము వచ్చి చెడు వాసన వస్తుంది. ఆ తర్వాత గిట్టలకు వ్యాధి సోకి కొన్ని సమయాలలో గిట్టలు ఊడిపోతాయి.

చికిత్స..

వ్యాధి సోకిన జీవాల కాళ్లను 10 శాతం జింక్ సల్ఫేట్ లేదా 5శాతం ఫార్మలిన్ ద్రావణంలో 5 నిమిషాలు ముంచాలి. తర్వాత లోరాక్సెన్ అనే యాంటిబయాటిక్ ఇంజెక్షన్లు, వరుసరగా 3-5 రోజులు వేయించాలి. కాళ్ల నొప్పులు తగ్గడానికి జోబిడ్ ఇంజెక్షన్లు వరుసగా 3-5 రోజులు వేయించాలి.

వ్యాప్తి..

ఈ వ్యాధి స్పోరోఫోరస్ నోడొసిస్, వుసిబాక్టీరియం నెక్రోఫోరిస్ అనే బాక్టీరియా ద్వారా వస్తుంది. బురద నేలల్లో తిరిగినప్పుడు, వరి కోతల తర్వాత పొలాల్లో గొర్రెలు, మేకలు తిరిగినపుడు వాటి గిట్టల మధ్య బురదతో పాటు ఈ బాక్టీరియా చేరుతుంది. వ్యాధి సోకిన గొర్రెల గిట్టలు ఇతర గొర్రెలకు తాకడం వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన జీవాలు ఉండే ప్రదేశాలలో వేరొక గొర్రెల మందలు తిరుగటం వల్ల కూడా వ్యాపిస్తుంది.

నివారణ..

జీవాల్ని చిత్తడినెలల్లో ఎక్కువ సేపు తిరగనివ్వరాదు. పొడిగా ఉండే ప్రదేశాల్లో మేపాలి. సిమెంట్ ఫుట్‌పాత్ ఏర్పాటు చేసి అందులోకి 8 శాతం పోటాషియం పర్మాంగనేట్ ద్రావణం 5 శాతం ఫార్మలిన్ ద్రావణం కానీ పోసి అందులో నుంచి జీవాల్ని ప్రతి రోజు 3-5 నిమిషాలు నడిపించాలి. వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరుచేసి చికిత్స చేయించాలి. అలాగే వ్యాధి సోకిన గొర్రెలు, మేకలు ఉండే మందల నుంచి కొనుగోలు చేయరాదు. వ్యాధి సోకిన వాటిని వేరు ప్రదేశాలకు లారీలు, ట్రాక్టర్లలో గాని రవాణా చేయరాదు.

పత్తి అమ్మకాలు ప్రారంభం


గురండిలో కొనుగోలు చేసిన పత్తి బస్తాలు లోడింగ్ చేస్తున్న కూలీలు

భామిని: మండలంలో పత్తి అమ్మకాలు ప్రారంభమయ్యాయి. గురండి, నేరడి, నులకజోడు, బిల్లుమడ గ్రామాల్లో ఆదివారం పలువురు వ్యాపారులు వచ్చి నేరుగా పత్తి కొనుగోలు చేశారు. ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం క్వింటా 6,400 రూపాయలు పలుకుతోందని రైతులు చెబుతున్నారు.

పంచారామాలకు ప్రత్యేక సర్వీస్‌లు


పంచారామ యాత్ర బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

పాలకొండ రూరల్: రాష్ట్రంలోగల ప్రముఖ పంచారామాలను దర్శించుకునేందుకు ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసులు నిర్వహిస్తున్నట్లు పాలకొండ డిపో సహాయ మేనేజర్ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం స్థానిక డిపో నుంచి 37 మందితో ఓ బస్సు బయలుదేరింది. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను దర్శించుకుని, తిరిగి పట్టణానికి చేరుకోవచ్చని సిబ్బంది తెలిపారు. భక్తులు నేరుగా కూడా బస్సు బుక్ చేసుకోవచ్చన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను ఆదుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను ప్రభుత్వం ఆదుకోవాలని గుమ్మలక్ష్మీపురం మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.గౌరీశంకరరావు కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ కనీస వేతనాలకు, ఉద్యోగ భద్రతకు వారు నోచుకోవడం లేదన్నారు. ఎప్పటికైనా వేతనం పెరుగుతుందనే ఆశతో ఆర్థిక ఇబ్బందులతోనే వారంతా కుటుంబాలను నెట్టుకొస్తున్నారని, అయినా ప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. వారంతా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని గత ఐదు రోజులుగా చేపడుతున్న నిరసన సమ్మెలు చేపడుతున్నారని, వారి సమ్మె వలన విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

షాపింగ్‌మాల్ ప్రారంభం


షాపును ప్రారంభిస్తున్న విక్రాంత్, కళావతి, తదితరులు

పాలకొండ: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అయ్యప్ప శంకర్ ఫర్నీచర్, ఎలక్ట్రికల్ షాపును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, పట్టణంలో వ్యాపార సముదాయాలు ఏర్పాటు కావడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో పట్టణ మాజీ చైర్మన్ పల్లా విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు వెలమల మన్మధరావు, దమలపాటి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్‌సెల్

పాలకొండ రూరల్: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎంవీ రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 32 పంచాయతీలకు సంబంధించిన ప్రజలు తమ ఫిర్యాదులు, అర్జీలను అందజేస్తే, ప్రాధాన్యతక్రమంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నగర పంచాయతీ కార్యాలయంలో..

పాలకొండ : నగర పంచాయతీ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించనున్నట్లు కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌సెల్ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ఫిర్యాదు రూపంలో తెలియజేయాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సీతానగరం: మండలంలోని రైతులకు రబీ సీజన్‌లో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని లైసెన్స్‌డ్ ఎరువుల దుకాణాల్లో ఉన్న నిల్వలను ఆదివారం ఆయన పరిశీలించారు. రికార్డులు, స్టాక్‌ను తనిఖీ చేశారు. మరిపివలసలోని వేంకటేశ్వర ఎరువుల షాపులో యూరియా 16.2 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు చెప్పారు. అలాగే బూర్జలోని విజయరామ ఫెర్టిలైజర్స్‌లో 22.17 మెట్రిక్ టన్నుల యూరియా, 33.45 మెట్రిక్ టన్నుల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.50 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 8.15 మెట్రిక్ టన్నుల సంకీర్ణ ఎరువులు ఉన్నట్లు చెప్పారు.

పరామర్శ


అచ్చెంనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణరావు తండ్రి అచ్చెంనాయుడు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం గ్రామానికి చేరుకుని లక్ష్మణరావును పరామర్శించారు. అచ్చెంనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, సతివాడ చిన్నంనాయుడు, వైశ్యరాజు గోవిందరాజు, అలజంగి ఏలియా, పొట్నూరు పరిసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్


బైక్ ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి గౌతమ్ అదానీని అరెస్టు చేయాలన్నారు. ప్రభుత్వం అదానీకి ఇచ్చిన భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రజల సంపదను కాపాడాలన్నారు. అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను బహిర్గతం చేయాలని, వాటని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సంపద పరిరక్షణకు ప్రజలంతా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గొర్లి వెంకటరమణ, వి.ఇందిర పాల్గొన్నారు.

సారా ప్యాకెట్ల పట్టివేత


స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో ఎక్సైజ్ సిబ్బంది

గరుగుబిల్లి/సీతానగరం: సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తెలిపారు. గరుగుబిల్లి మండలం కొంకడివరం గ్రామ సమీపంలో ఆదివారం దాడులు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 80 సారా ప్యాకెట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిపై కేసు నమోద చేసినట్లు సీఐ తెలిపారు. మద్యం, సారా అక్రమంగా నిల్వ చేసిన, విక్రయించిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం బెల్టుషాపులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

రహదారికి మరమ్మతులు

- సాక్షి స్పందన


జేసీబీ సాయంతో గోతుల పూడ్చివేత

పాలకొండ రూరల్: పాలకొండ వయా వీరఘట్టం మీదుగా జిల్లా కేంద్రమైన పార్వతీపురం వెళ్లే రహదారిలో ఏర్పడిన గోతులను అధికారులు ఆదివారం పూడ్చారు. రహదారులు అధ్వానంగా ఉండడంతో ఇటీవల సాక్షిలో 'ఛిద్రమైన రోడ్లతో అవస్థలు' పేరిట ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈక్రమంలో రాయుడు కోనేరు, అగ్నిమాపక కేంద్రం, గజాల ఖానా, తుమరాడ, గ్యాస్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో జేసీబీ సాయంతో గోతులను పూడ్చారు. త్వరలోనే శాశ్వత మరమ్మతులు చేపడతామని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

కాల్చితే కాలుష్యం..

దున్నితే సారవంతం


కాలుతున్న వరి కొయ్యల వల్ల వెలువడుతున్న కాలుష్యం

- వరి కొయ్యలను కలియ దున్నితే లాభాలు : వ్యవసాయాధికారులు

భామిని: ప్రస్తుతం వరి కోతలు, నూర్పిడి పనులు పూర్తి చేసుకుంటున్న రైతులు ధాన్యం విక్రయించే ప్రయత్నాల్లో ఉన్నారు. యంత్రాల సహాయంతో తక్కువ కాలంలోనే నూర్పిడి పనులు పూర్తి చేసుకున్నారు. అయితే రెండో పంటగా రబీ వరి, ఇతర పంటలు వేయడానికి సిద్ధమవుతున్న రైతులు పొలాల్లో విడిచిన వరి కొయ్యలు, పడిపోయిన గడ్డిని తగులబెడుతున్నారు. సారవంతమైన వరి కొయ్యలను అగ్నికి ఆహుతి చేసి పొలాన్ని బూడిదతో, వాతావరణాన్ని కాలుష్యంతో నింపుతున్నారని వ్యవసాయాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుకు అవగాహన లేకపోవడంతో సారవంతమైన మట్టిలో నీటి శాతం నాశనం చేసుకుంటున్నాడని చెబుతున్నారు. కోత, నూర్పిడి యంత్రాల నుంచి పడిన వరి గడ్డి పొలాల్లో గట్లుగా, వరుస బోదెలుగా పడుతుంది. అయితే రబీ సాగుకు అనువుగా పొలంలోని గడ్డి కుప్పలను తగులబెట్టడం వల్ల పొలానికి తీవ్ర నష్టం జరగనుంది. భూమిలోని నీటి శాతం తగ్గిపోవడంతో పాటు సూక్ష్మజీవులు నశిస్తాయి.

యంత్రాల వల్లే..

ప్రస్తుతం పంట కోతలకు యంత్రాలు ఉపయోగించడంతో వరిచేనును 30 సెంటీమీటర్ల ఎత్తులో కోస్తున్నాయి. 50 శాతం గడ్డి కొయ్యల రూపంలో పంట అవశేషాలు మిగిలిపోతున్నాయి. ఎకరాకు రెండు టన్నుల మేర వరి కొయ్యలు గడ్డిరూపంలో మిగిలి పోతున్నాయి. వీటిని రైతులు కాల్చడం వల్ల పర్యావరణంలో పెనుమార్పులు సంభవిస్తాయి. ఒక టన్ను వ్యర్థాలు తగలబెట్టడం వల్ల 60 కిలోల కార్బన్‌మోనాక్సైడ్‌తో పాటు 1,400 కిలోల కార్బన్‌డై యాక్సైడ్ గాలిలోకి విడుదలవుతాయి. ఇదే కాకుండా సూక్ష్మధూళి కణాలు, బూడిద గాలిలో కలవడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుంది. అలాగే నేల పొరల్లోని తేమ శాతం ఆవిరై దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయి.


దున్నడం వల్ల లాభాలు..



టన్ను వరిగడ్డి పెరగడానికి భూమి నుంచి 6.2 కిలోల నత్రజని, 1.1కిలోల భాస్వరం, 18.9 కిలోల పోటాష్, కొద్ది మోతాదులో సూక్ష్మపోషకాలు అవసరమవుతాయి. అందువల్ల ఈ వరికొయ్యలను కలియ దున్నడం వల్ల ఈ పోషకాలన్నీ తిరిగి నేలను చేరుతాయి. లేదంటే పంట వ్యర్థాలను ముడి పదార్థాలుగా వాడుకొని కంపోస్టు పద్ధతి ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చు.

– కొర్ను సింహాచలం, ఏఓ, భామిని

సూపర్ ఫాస్ఫేట్ వేయాలి..



నాట్లు వేయడానికి ముందు దమ్ము చేసేటప్పుడు ఎకరాకు యాభై కిలోల సూపర్‌ఫాస్ఫేట్ వేయడం వల్ల కొయ్యలు తొందరగా కుళ్లి సేంద్రియ పదార్థాలుగా మారుతాయి. వరి కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కార్బన్‌శాతం పెరగడమే కాకుండా దిగుబడి 8 నుంచి 10 శాతం పెరుగుతుంది.

పెదపెంకి షణ్ముఖరాజు, డీపీఎం, ఏపీసీఎన్ఎఫ్, కురుపాం

సామూహిక సత్యనారాయణ వ్రతాలు..



పాలకొండ పట్టణంలోని నక్కలపేటలో గల అయ్యప్ప మందిరంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా చేపట్టారు. అలాగే మృత్యుంజయ మరకత లింగేశ్వర ఆలయంలో దశవిధ హారతి కార్యక్రమం అర్చకుడు శరత్‌కుమార్ నేతృత్వంలో జరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– పాలకొండ రూరల్